# విశాల రహదారి.. ఇరుగ్గా మారి..

- ఆక్రమణలతో కుచించుకుపోతున్న తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డు
- రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలతో ఇబ్బందులు • దృష్టి సారించని అధికారులు


80 ఫీట్ రోడ్డులో కట్టి ఉంచిన పశువులు


తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో నిలిపి వదిలేసిన పాడైన కార్లు

### కార్ల నుంచి బస్సుల వరకు..

తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని జీవీఎంసీ వాటర్ ట్యాంకుల నుంచి రామచంద్రనగర్ ఆర్చ్ వరకు రహదారికిరువైపులా చిన్న చిన్న కార్ల నుంచి పెద్ద బస్సుల వరకు పార్క్ చేస్తున్నారు. కొన్ని వాహనాలు ఉదయమే తీసి, సాయంత్రం తిరిగి పార్క్ చేస్తుంటారు. కొన్ని వాహనాలు ఎందుకు పనికిరాకుండా రోడ్డు మధ్యలో కనీసం కదలలేని, కదపలేని స్థితిలో పడి ఉన్నాయి. వీటి వల్ల కూడా రోడ్డు ఇరుకైపోయింది.

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని అనేక ప్రాంతాల్లో రహదారులు, ఫుట్‌పాత్‌లు కుచించుకుపోతున్నాయి. ఇష్టానుసారంగా వాటిని ఆక్రమించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల వ్యాపారాలకు.. మరికొన్ని చోట్ల గొడౌన్స్‌లా ఇవి ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా తాటిచెట్లపాలెం–మహారాణి పార్లర్ 80 అడుగుల రహదారి నిరంతరం ఆక్రమణలతోనే నిండి ఉంటుంది. ఈ మార్గంలో ఎప్పుడూ సగం భాగంలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్, ఇటుక, ఇసుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ రహదారి సగానికి పైగా ఆక్రమణకు గురైంది. దీంతో పాదచారులు రోడ్డు మధ్యలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇక్కడి పరిస్థితులపై అధికారులు దృష్టి సారించకపోవడంతో కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.


వాటర్ ట్యాంక్ ఎదురుగా రోడ్డుపైనే వ్యాపారాలు

### రైతుబజార్ ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు



నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌ల గురించి ఇక చెప్పనక్కరలేదు. రైతుబజార్ గోడను ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లు మచ్చుకైనా కానరావు. వీటిపై ఎల్లప్పుడూ వ్యాపారాలు, వ్యాపార సామగ్రి ఉంటుంది. దీంతో గతి లేక పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో ఒకవైపు మాత్రమే పార్కింగ్‌కు పోలీసులు ఏర్పాటు చేసినా.. రైతుబజార్‌కు వచ్చే వాహనాలతో రోడ్డుకిరువైపులా పార్కింగ్ చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. ఫుట్‌పాత్ వ్యాపారాలు, రాంగ్ పార్కింగ్‌తో రోడ్డు చిన్నదిగా మారి ఇతర వాహనాల రాకపోకలకు, పాదచారులు నడిచేందుకు ఇబ్బందికరంగా ఉంటుంది. అధికారులు పరిశీలించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలుతొలగించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

### రోడ్డుపైనే వ్యాపారాలు..

ఈ రోడ్డుపైనే పలువురు చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన ఇటుక, ఇసుక, పిక్క వంటి సామగ్రిని రోడ్డు పైనే వేసి ఇక్కడ నుంచి చిన్న చిన్న ఆటోలు, వ్యాన్‌ల్లో విక్రయాలు సాగిస్తున్నారు. వాహనాల మరమ్మతులు, ఇతర వ్యాపారాలకు, పశువులను కట్టి ఉంచేందుకు తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డు అడ్డాగా మారిపోయింది. వీరు ఎటువంటి అద్దె, అడ్వాన్స్‌లు లేకుండా రహదారి లేదా ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి 80 అడుగుల రహదారిలో ఆక్రమణలను తొలగించి పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తే సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**సీతమ్మధార:** సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార తహసీల్దార్ ఆఫీస్, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, సత్యం జంక్షన్, వెన్నెల ఫంక్షన్ హాల్ ఏరియా, గణేష్‌నగర్, పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

## వైభవుడికి విశేష పూజలు


వైభవుడి ఆలయంలో పాశుర పారాయణం చేస్తున్న ఈవో ప్రసాద్ దంపతులు, భక్తులు

**మురళీనగర్:** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవిని వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి 11వ పాశుర విన్నపం చదివి వినిపించారు. భక్తులు పాశుర పారాయణం చేశారు. మంగళాశాసనం, తీర్థ ప్రసాదగోష్ఠి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శేషాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా 11వ పాశురం ప్రాధాన్యాన్ని వివరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వైభవుడికి నక్షత్ర హారతి సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మురళీనగర్ రామాలయంలో సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతోపాటు పాశుర విన్నపం సమర్పించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విద్యుత్ చార్జీలపై నేడు ‘వైఎస్సార్‌సీపీ పోరుబాట’


కె.కె.రాజు

**సీతమ్మధార:** కూటమి ప్రభుత్వం అమలు చేసిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు గురుద్వారా హైవే జంక్షన్ నుంచి పాదయాత్రగా బయలుదేరి ఎన్‌ఆర్‌ఐ(కిమ్స్) హాస్పిటల్ లైన్‌లో ఉన్న ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రజల తరఫున వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు జయప్రదం చేయాలని కె.కె.రాజు ప్రకటనలో కోరారు.

### జోరందుకున్న రిజిస్ట్రేషన్లు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయ విక్రయదారులు

**సీతంపేట:** జనవరి 1 నుంచి స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న పాత రేట్లతో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి జనం సిద్ధమవుతున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గురువారం క్రయ విక్రయదారులతో కిటకిటలాడింది. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు కావడానికి కేవలం ఐదు రోజులే మిగిలి ఉంది. స్థలాలు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారితో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ నెలకొంది. ద్వారకానగర్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 10 నుంచి 15 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతున్నట్టు సమాచారం. ఇవి కొంత వరకైనా తగ్గుతాయని క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. నెట్ సరిగా పనిచేయకపోయినా.. రాత్రి 7 గంటల వరకు కార్యాలయ సిబ్బంది పనిచేసి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

### రైల్వేస్టేషన్‌లో 18 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయి, రవాణాదారుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

**తాటిచెట్లపాలెం:** విశాఖ నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.కె.అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ పి.ఆర్.బిషోయి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర, ముంబైకు చెందిన సచిన్ శివాజీ కాలే విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా ముంబైకు గంజాయి రవాణా చేయడాన్ని ఆర్పీఎఫ్ ఎస్‌ఐ బిషోయి గుర్తించి, జీఆర్పీ ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. జీఆర్పీ ఎస్‌ఐ అతడి వద్ద నుంచి రూ.90 వేల విలువైన 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

## కల్యాణ వెంకన్నకు పాశుర విన్నపం


లలితా పీఠంలో పాశుర అర్థ వివరణ ఇస్తున్న చార్యులు


పాశురం పఠిస్తున్న భక్తులు

**సీతంపేట:** అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం 11వ రోజు కల్యాణ వేంకటేశ్వరుడికి పాశుర విన్నపం ఘనంగా నిర్వహించారు. ఏకాదశి స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టభుజ సుదర్శన సహిత ధన్వంతరి హోమం, సాయంత్రం సామూహిక లక్ష్మి సహస్ర నామ కుంకుమార్చన చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పాశురం పఠించారు.

## వంగవీటి రంగా విగ్రహావిష్కరణ


అక్కయ్యపాలెంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

**సీతంపేట:** రాధా రంగ రాయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 44వ వార్డు అక్కయ్యపాలెం హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి రంగా విగ్రహాన్ని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు మౌర్యసింహ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రంగా ఒక కులానికో, వర్గానికో చెందిన వ్యక్తి కాదని, పేదలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గాదె బాలాజీ మాట్లాడుతూ విజయవాడకు రంగా పేరు పెట్టాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలను కోరామని, వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం, అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, శ్రీవాణి, భీశెట్టి వరలక్ష్మి, టి.శ్రీనివాసరావు, గోవింద్, శివ, ప్రభాకర్, పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు.

## గురుద్వారాలో ఘనంగా ‘వీరబాల దివస్’


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, గురుద్వారా కమిటీ ప్రతినిధులు

**సీతమ్మధార:** గురుద్వారా సద్ సంగత్‌లో గురువారం వీరబాల దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు చేతుల మీదుగా వీరబాల దివస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అతి చిన్న వయసులోనే దేశం, ధర్మం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమై, సజీవ సమాధి గావించబడిన సిక్కు గురువు గురు గోవింద్‌సింగ్ మహారాజు వీరపుత్రులు ఫతే సింగ్, జొరావర్ సింగ్ త్యాగాలకు గుర్తుగా వీరబాల దివస్ నిర్వహిస్తారని గురుద్వారా సద్ సంగత్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారి త్యాగాలు, సాహసం, పరాక్రమాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో గురుద్వారా అధ్యక్షుడు ఆనంద్ సింగ్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, బీజేపీ మెడికల్ సెల్ నాయకులు రూపాకుల రవికుమార్, బొడ్డేటి రవికుమార్, ఇతర నాయకులు గురుద్వారా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపాలి

**తాటిచెట్లపాలెం:** పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోర్టు ఆస్పత్రి ఎదురుగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 87వ రోజుకు చేరాయి. సీఐటీయూ, పోర్ట్, డీఎల్‌బీ కార్మిక సంఘాల సారథ్యంలో జరుగుతున్న ఈ దీక్షల్లో సీఐటీయూ నాయకుడు వి.ఎస్.పద్మనాభరాజు పాల్గొని మాట్లాడారు. ఖర్చులను తగ్గించి మెరుగైన వైద్యం అందించడానికి పోర్టు హాస్పిటల్‌ను కార్పొరేట్‌కు ఇస్తున్నామన్న మాట అబద్ధమని, విలువైన పోర్టు ఆస్పత్రి భూములను చౌకగా కాజేయడానికి ఈ నిర్ణయమని ఆరోపించారు. 87 రోజులుగా అన్ని యూనియన్లు పోరాడటం వల్లే హాస్పిటల్ టెండర్లు వేయడానికి వెనకడుగు వేశారన్నారు. సుమారు 40 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఈ టెండర్‌ను రద్దు చేసి, పీపీపీకి ఇవ్వమని చైర్మన్, కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో సీఐటీయూ నాయకులు జక్కాన సత్యనారాయణ, ఉరుకూటి రామలింగేశ్వరరావు, వి.ఎన్.మూర్తి, కొల్లాబత్తు విజయ్‌కుమార్, నర్సింగ్, శ్రీనివాస్, సిహెచ్.డి. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

## గ్రీన్‌బెల్ట్‌ల్లో వ్యర్థాల తొలగింపు

**మద్దిపాలెం:** గ్రీన్‌బెల్ట్‌ల అధ్వాన పరిస్థితిపై ‘వ్యర్థాలకు నిలయంగా గ్రీన్‌బెల్ట్‌లు’ అనే శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి అధికారులు తక్షణం స్పందించారు. 51వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద, 53వ వార్డు మద్దిపాలెం హైవే వద్ద వ్యర్థాలతో నిండిన గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని గురువారం జీవీఎంసీ సిబ్బంది శుభ్రం చేసి, వ్యర్థాలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్త చేశారు.

## 2.1 కిలోల గంజాయి పట్టివేత

**సీతమ్మధార:** నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2.1 కిలోల గంజాయిని నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. నలుగురు నిందితులు సీతమ్మధారలో కొనుగోలు చేసిన గంజాయిని బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద మొత్తం పది మంది సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పవన్(అలియాస్ మైఖేల్) శ్రీనగర్ రామాటాకీస్ వద్ద నివసిస్తున్న పృథ్వీరాజ్ వద్ద కొనుగోలు చేశాడు. నిందితులను పోలీసులు గురువారం కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి ఆరుగురికి రిమాండ్ విధించారు. మిగిలిన నలుగురు గంజాయి సేవించిన వారిని పోలీసులు విచారిస్తున్నారు. సీఐ ఆత్మకూరి సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్‌ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపటి నుంచి మూడో విడత రెవెన్యూ సదస్సులు


తహసీల్దార్ రమేష్

**సీతమ్మధార:** ఈ నెల 28 నుంచి జనవరి 3 వరకు మూడో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ తెలిపారు. సీతమ్మధారలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ‘సాక్షి’తో ఆయన మాట్లాడారు. 28వ తేదీన 15, 16, 23 వార్డులకు సంబంధించి మద్దిలపాలెం, కొత్త వెంకోజీపాలెం కొండ ప్రాంతం, పాత వెంకోజీపాలెం ప్రాంత ప్రజలకు మద్దిలపాలెం కృష్ణా ప్రభుత్వ కళాశాల ఆవరణలో రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు. 30వ తేదీన 17, 18, 19, 20, 21, 22 వార్డులకు సంబంధించి పెదవాల్తేరు, చినవాల్తేరు, కొత్త వెంకోజీపాలెం, లాసన్స్‌బే కాలనీ, పెదజాలరిపేట ప్రాంతాల ప్రజలకు పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహిస్తారని చెప్పారు. 14, 25, 26, 42, 43, 44 వార్డుల్లో గల అల్లిపురం ఎక్స్‌టెన్షన్ వార్డు ప్రజలకు జనవరి 3న బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక రోడ్డులో గల సింధూర అతిథి గృహంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు. ప్రజలు భూ సమస్యలకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## పార్కులో పేరుకుపోయిన చెత్త


అక్కయ్యపాలెం గ్రీన్‌బెల్ట్ పార్కులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

**సీతంపేట:** జాతీయ రహదారికిపై అక్కయ్యపాలెం కూడలిని ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్కు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ను అభివృద్ధి చేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చని మొక్కలతో పార్కు ఆహ్లాదంగా కనిపిస్తున్నా.. దానిలో పేరుకుపోయిన చెత్త రోత పుట్టిస్తోంది. నిత్యం ఎంతోమంది సేద తీరడానికి ఇక్కడికి వస్తుంటారు. లక్షల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన ఈ పార్కులో సరైన పారిశుధ్య నిర్వహణ కరువైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పార్కు పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇళ్ల పట్టాల మంజూరుకు వినతుల వెల్లువ


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్

**మద్దిపాలెం:** జీవీఎంసీ 53వ వార్డు పరిసర ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై, ఇళ్ల పట్టాల మంజూరుకు వినతులు వెల్లువెత్తాయి. మద్దిపాలెం మసీద్ వద్ద ఉన్న సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గోపాలపట్నం తహసీల్దార్ సిహెచ్.వి.రమేష్ స్థానిక ప్రజల వద్ద నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని ముస్లిం శ్మశానవాటిక సమస్యపై తహసీల్దార్‌కు మసీదు కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సదస్సుకు తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమయానికి వచ్చి అవగాహన కల్పించగా.. మిగతా శాఖల అధికారులు మాత్రం 11.30 గంటలైనా వేదికకు రాకపోవడం గమనార్హం. కొందరు నామమాత్రానికే వచ్చినట్టు ఉండటంపై పలువురు మండిపడుతున్నారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ బి.రాము, ఇతర అధికారులు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె దీపిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం సర్వ శ్రేష్ఠం


రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో అన్నదానం ప్రారంభిస్తున్న గొండు సీతారాం


ధ్యాన మందిరం వద్ద యాచకులకు రగ్గులు పంపిణీ చేస్తున్న మోక్షిత

**తాటిచెట్లపాలెం:** అన్ని దానాల్లో అన్నదానం సర్వ శ్రేష్టమైనదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. మార్గశిర మాసం ఆఖరి గురువారం సందర్భంగా రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు పర్యవేక్షణలో కొన్నేళ్లుగా బడుగు, బలహీన, యాచక, నిరాశ్రయులకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమన్నారు. శేషగిరిరావు మాట్లాడుతూ షిర్డీసాయి ఆశీస్సులతో, భక్తులు, దాతల సహకారంతో మందిర ప్రాంగణంలో నిత్య, ప్రత్యేక అన్నదానాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటితోపాటు అన్నార్తుల ఆకలిని తీర్చేందుకు కమ్యూనిటీ ఫ్రిజ్‌ల ద్వారా కూడా ఆహారాన్ని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ధ్యాన మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**యాచకులు, నిరాశ్రయులకు రగ్గుల పంపిణీ**

ధ్యాన మందిరం ఎదుట, రైల్వేస్టేషన్ రోడ్డులోని నిరాశ్రయులు, యాచకులకు పి.త్రివేణి, అప్పారావు దంపతుల మనవరాలు మోక్షిత చేతుల మీదుగా రగ్గులు పంపిణీ చేశారు. చలికాలంలో పేదల కోసం ప్రతీ ఏటా తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు త్రివేణి తెలిపారు.

## సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి

**సీతమ్మధార:** జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా ఆలయంలోని సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారిని పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో భక్తులకు సదుపాయాలు కల్పించారు. దేవస్థాన సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.